ప్రజాశక్తి

ఆదివారం 12 అక్టోబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

క్రికెట్ జోష్

- నేడు విశాఖ వేదికగా భారత్ - ఆసీస్ ఢీ
- హాట్ కేకుల్లా టిక్కెట్ల అమ్మకాలు
- జైషా, నారా లోకేష్ సహా తరలిరానున్న పలువురు ప్రముఖులు



ముమ్మర సాధనలో భారత క్రీడాకారిణులు



నెట్ ప్రాక్టీస్‌లో ఆసీస్ క్రీడాకారిణి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

విశాఖలో క్రికెట్ జోష్ నెలకొంది. ఈ సండే పసందైన క్రీడా విందును పంచనుంది. ఐసిసి ఉమెన్స్ వరల్డ్ కప్ - 2025లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం నగరంలోని ఎసిఎ - విడిసిఎ మైదానం వేదికగా భారత జట్టు ఆస్ట్రేలియాతో తలపడనుంది. ఈ టోర్నమెంట్‌లో ఫేవరెట్ జట్లుగా బరిలోకి దిగిన ఈ రెండు జట్లు చాలా బలంగా ఉన్నాయి. ఆస్ట్రేలియా ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకూ మూడు మ్యాచ్‌లు ఆడి అందులో రెండింట విజయం సాధించింది. ఒక మ్యాచ్‌లో ఫలితం తేలలేదు. దీంతో ఐదు పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. భారత జట్టు ఆడిన మూడు మ్యాచ్‌లలో రెండింటిలో విజయం సాధించి ఒక మ్యాచ్‌లో ఓటమిపాలై నాలుగు పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. ఈ ప్రపంచ కప్ టోర్నీలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైనదిగా భావిస్తున్న ఈ మ్యాచ్‌కు సంబంధించిన టిక్కెట్లు పూర్తిగా అమ్ముడయ్యాయని అధికారులు తెలిపారు.

ఆదివారం జరగనున్న మ్యాచ్‌కు సంబంధించి శనివారం సాయంత్రం ఎసిఎ - విడిసిఎ మైదానంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భారత జట్టు తరుపున క్రీడాకారిణి స్నేహరాణా మాట్లాడుతూ బలమైన ఆస్ట్రేలియా బ్యాటింగ్‌ను ఎదుర్కొనేందుకు తమ వద్ద ప్రత్యేక ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. ఇటీవల జరిగిన వన్డే సిరీస్ ద్వారా ఆస్ట్రేలియా జట్టు బలాబలాలు తమకు తెలిశాయని ఆమె అన్నారు. అదేవిధంగా విశాఖపట్నం బ్యాటింగ్ ట్రాక్ అయినందున మొదట బ్యాటింగ్ చేసి అత్యధిక పరుగులు సాధిస్తే విజయ అవకాశాలు మెరుగ్గా ఉంటాయని ఆమె ఆశాభావం మిగతా 2లో..

బల్క్ డ్రగ్ పార్కు వ్యతిరేక ఉద్యమంపై

ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండించండి

సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ

ప్రజాశక్తి - అనకాపల్లి : నక్కపల్లి మండలంలోని రాజయ్యపేట గ్రామంలో ఏర్పాటు చేయనున్న బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించడాన్ని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ ఖండించింది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అణిచివేత, నిర్బంధ చర్యలు మానుకొని ప్రజల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని కోరింది. ఈ మేరకు తీర్మానం చేసింది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం అనకాపల్లిలోని దొడ్డి రామునాయుడు భవనంలో శనివారం జరిగింది. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు, జి.సత్యనారాయణ, గంటా శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో చేసిన తీర్మానాన్ని నాయకులు మీడియాకు వెల్లడించారు. బల్క్‌డ్రగ్ పార్క్‌తో మత్స్యకారుల జీవనోపాధి, స్థానిక ప్రజల ఆరోగ్యం, పర్యావరణానికి తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ఈ పార్క్ నిర్మాణంతో సముద్ర కాలుష్యం పెరిగి మత్స్య సంపద నాశనమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా వేలాది కుటుంబాలు తమ జీవనాధారాన్ని కోల్పోతాయన్నారు. ప్రభుత్వం అభివృద్ధి పేరిట ప్రజల జీవన భద్రతలను పక్కన పెట్టి, కార్పొరేట్ల లాభాల కోసం మాత్రమే కృషి చేయడం శోచనీయమన్నారు. ప్రజల మనోభావాలను గౌరవించి వెంటనే బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా సిపిఎం నాయకులను గృహ నిర్బంధం చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని కోరారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యం కోసం మాట్లాడిన టిడిపి నాయకులు నేడు ఎందుకు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. బల్క్‌డ్రగ్ పార్కు ప్రమాదకరమని నినదించిన హోంమంత్రి అనిత నేడు మాట మార్చడం తగదన్నారు. అధికారంలోకి రాగానే బల్క్ డ్రగ్ పార్కు ఎలా ప్రమాదకరం కాకుండా పోయిందో ఆమె ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బల్క్ డ్రగ్ పార్కు నిర్బంధంపై భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ సీజన్ 2025-26లో ధాన్యం సేకరణకు సంబంధించి రైతులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సీజన్‌లో జిల్లాలో మొత్తం 40 రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించినట్లు వెల్లడించారు. ధాన్యానికి కనీస మద్దతు ధర, సాధారణ రకం మిగతా 2లో..

కల్తీ మద్యంపై సమగ్ర విచారణ జరపాలి

▶ వార్త 5లో..

భెల్ గుర్తింపు ఎన్నికలకు సన్నాహాలు

▶ వార్త 4లో..

బల్క్ డ్రగ్ పనులు చేపడితే ఊరుకోం

▶ వార్త 2లో..

రామస్వామి సేవలు చిరస్మరణీయం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్



రామస్వామి చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ దేవానంద్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

సుప్రీంకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె.రామస్వామి ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని ఎపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జస్టిస్ డాక్టర్ కె.రామస్వామి చిత్రపటాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. గతంలో కె.రామస్వామి ఎయులో 'పబ్లిక్ పవర్ అండ్ జ్యూడిషియల్ ఫంక్షన్' అనే అంశంపై ఇచ్చిన ప్రసంగంతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. జస్టిస్ రామస్వామి పేరు మీద ఏర్పాటు చేసిన స్మారక ప్రసంగంలో మాట్లాడారు. మహోన్నత వ్యక్తిత్వం జస్టిస్ కె.రామస్వామి సొంతమని పేర్కొన్నారు. విద్యార్థి నాయకునిగా తొలిసారిగా తాను ఆయనను కలిసిన సందర్భం, ఎయుకు ముఖ్య అతిథిగా ఆహ్వానించి తీసుకువచ్చిన సందర్భాన్ని దేవానంద్ గుర్తు చేసుకున్నారు. రామస్వామి చారిత్రాత్మకమైన తీర్పులు అందించారని చెప్పారు. నేడు తాను ఉన్నత స్థానంలో నిలవడానికి తన గురువుల అందించిన అత్యుత్తమ బోధన, మార్గదర్శకం కారణమని చెప్పారు. వారికి ఎల్లప్పుడూ తాను రుణపడి ఉంటానని అన్నారు. ఎయు వైస్ ఛాన్సలర్ ఆచార్య జిపి.రాజశేఖర్ మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల ఎందరో న్యాయ కోవిదులను సమాజానికి అందించిందని చెప్పారు. ఇక్కడ విద్యను అభ్యసించి ఉన్నతంగా ఎదిగిన మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

రామస్వామి సేవలు చిరస్మరణీయం

వారందరూ ఎయుకు రావడం, విశ్వవిద్యాలయ కార్యక్రమాలలో భాగం కావడం ఎంతో గర్వకారణమని చెప్పారు. చారిత్రాత్మక తీర్పులను అందించి ఒక ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్న జస్టిస్ కె.రామస్వామి పేరుతో స్మారక ప్రసంగం ఏర్పాటు చేయడం ఎంతో మంచి పరిణామమని అన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను అభినందించారు. న్యాయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.సీతామాణిక్యం మాట్లాడుతూ సమానత్వం, న్యాయం కోసం జస్టిస్ రామస్వామి విశేష కృషి చేశారని చెప్పారు. ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి కావడం విద్యాలయానికి ఎంతో గర్వకారణమన్నారు. న్యాయానికి ప్రతిరూపంగా ఆయన నిలుస్తారని అన్నారు. ఆయన అందించిన పలు చారిత్రాత్మక తీర్పులను ఉదహరిస్తూ ఆయన ప్రత్యేకతను వివరించారు. ఎయులో స్మారక ప్రసంగం ఏర్పాటు చేయడానికి కృషిచేసి, అవసరమైన నిధులను అందించిన రామస్వామి కుమారుడు, ఐఎఎస్ అధికారి కె.శ్రీనివాస్‌ను అభినందించారు. ముందుగా న్యాయ కళాశాల వద్దనున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె.రాంబాబు, జస్టిస్ రామస్వామి కుమార్తె డాక్టర్ జయ, కుటుంబ సభ్యులు ఐశ్వర్య, గార్గి, సుభాంగ్ జోషి, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయ కళాశాల విశ్రాంత ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ జోష్

వ్యక్తం చేశారు.

ఆస్ట్రేలియా తరపున మీడియా సమావేశానికి హాజరైన జట్టు కెప్టెన్ అలీస్సా హెల్లీ మాట్లాడుతూ విశాఖపట్నం వాతావరణం రీత్యా స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటుందని, తాము బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో బలంగా ఉన్నామని తెలిపారు. సాధారణ సిరీస్‌లతో పోల్చుకుంటే ప్రపంచకప్ వంటి మెగా టోర్నీల్లో ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని అన్నారు.

నేడు మహిళా క్రికెటర్లకు అరుదైన గౌరవం

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రపంచకప్ - 2025 పోటీల్లో భాగంగా విశాఖపట్నంలోని ఎసిఎ - విడిసిఎ మైదానంలోని స్టాండుకు భారత మహిళా జట్టు మాజీ సారథి మిథాలీ రాజ్ పేరును, అదే విధంగా ఒక గేటుకు భారత క్రీడాకారిణి రావి కల్పన పేరును పెట్టేందుకు నిర్ణయించింది ఈ సందర్భంగా ఆదివారం రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఈ స్టాండ్, గేటును ప్రారంభించనున్నారు.

నేడు విశాఖకు ప్రముఖులు

నేడు విశాఖలో జరగనున్న భారత్ - ఆసీస్ మ్యాచ్‌ను వీక్షించేందుకు ఐసిసి ఛైర్మన్ జైషాతో పాటు రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, రాజ్యసభ సభ్యులు సానా సతీష్, బిసిసిఐ, ఐసిసి ప్రతినిధులు హాజరుకానున్నారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి

(కామన్) క్వింటాకు రూ.2,36,ఎ గ్రేడ్ రకం క్వింటాకు రూ.2,389గా నిర్ణయించినట్లు తెలిపారు. ఇది గత సంవత్సరం కంటే రూ.69 ఎక్కువగా ఉందని ఆయన వివరించారు. రైతులు ధాన్యం విక్రయంలో ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా టోల్‌ఫ్రీ నంబర్ 1967కు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సంప్రదించవచ్చని, అదనంగా జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్ 7702003581 ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సమస్యలపై మీసేవ ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలోని అర్బన్ మీ సేవా కేంద్రాలలో విధులు నిర్వహించే ఉద్యోగులను వైసిపి ప్రభుత్వం తొలగించిందని, అలా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగాలు కోల్పోయిన వారు ఉన్నారని, వారందరికీ తిరిగి మీసేవ కేంద్రాలలో ఉద్యోగాలు ఇవ్వాలని ఎపి 'ఇ' (మీ) సేవ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.నాగేశ్వరరావు అన్నారు. శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మీ సేవ ఉద్యోగుల సమస్యలపై అభ్యర్థన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో లోకేష్ ఇచ్చిన హామీని గుర్తుచేశారు. ఆ వాగ్దానాన్ని అమలు చేసి 607 మందికి వెంటనే ఉద్యోగాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా శ్రామిక మహిళ కన్వీనర్ పి.మణి శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.

రజకుల సమస్యలు పరిష్కరిస్తా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సీతమ్మపేట రజకుల సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. శనివారం సీతమ్మపేట రజకులకు పక్కా ఇళ్లు నిర్మించాలని, దోబీఘాట్ కుండీలు, షెడ్లు నిర్మించాలని కోరుతూ ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు నాయకత్వంలో ప్రతినిధులు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఎస్.ఈశ్వరరావు, సింహాద్రి, లక్ష్మి పాల్గొన్నారు.

రొమ్ము కేన్సర్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: మహిళల్లో వచ్చే రొమ్ము క్యాన్సర్ వ్యాధి పట్ల గ్రామస్థాయి నుంచి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని విశాఖ కలెక్టర్ భార్య, ప్రముఖ అడ్వకేట్ దివ్యప్రసాద్ అన్నారు. అక్టోబర్‌లో పింక్‌మంత్ పేరిట రొమ్ముక్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం కెజిహెచ్ మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్ప ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

అదానికి వత్తాసా ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ఒక వ్యక్తి గుణగణాలు పరీక్షించి చూడాలంటే అతనికి అధికారం ఇచ్చి చూడాలి' - అని అమెరికన్ యోధుడు, అధ్యక్షుడు అబ్రహం లింకన్ అన్న మాటలు తాజాగా విశాఖ రాజకీయాలను పరీక్షించే వారికెవరికైనా ఇట్టే అర్థమవుతాయి. గాజువాక, పెదగంట్యాడ ప్రాంతాల్లోని పలు గ్రామాలను కాలుష్య కాషారంలో ముంచెత్తడానికి రాబోతున్న అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీపై స్థానిక ప్రజానీకం పెద్ద ఎత్తున పోరాడి 'పబ్లిక్ హియరింగ్'ను జరగకుండా అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఇంత జరిగాక కూడా ఫ్యాక్టరీ యాజమాన్యం స్థానిక ప్రజానీకానికి అవగాహన కలిగించాలని, ప్రజాభిప్రాయానికి గౌరవం ఇవ్వాలని అంటూ స్థానిక గాజువాక ఎంఎల్ఎ పల్లా శ్రీనివాసరావు సన్నాయి నొక్కులు నొక్కడం పలువురి విమర్శలకు గురౌతోంది. ఇళ్లల్లోంచి సాధారణ మహిళలు సైతం వచ్చి కాలుష్య సిమెంట్ పరిశ్రమ మాకొద్దు తేవొద్దు...అంటూ నినాదాలు చేయడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

వద్దని మొరపెడుతుంటే అవగాహన కల్పిస్తారా?

జనావాసాల మధ్యలో కాలుష్యానికి కారణమైన సిమెంట్ ఫ్యాక్టరీని పెడుతుంటే ప్రజల తరపున నిలబడి దాన్ని అడ్డుకోడానికి ముందుండాల్సిన అధికార పార్టీ ప్రతినిధి సన్నాయి నొక్కులు నొక్కడం పలువురికి ఆగ్రహాన్ని తెప్పిస్తోంది. అదానికి వత్తాసు పలుకుతున్నట్టు అతని వైఖరి ఉంది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ విషయంలోనూ ఇలాగే ఆయన ఉన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఒకవైపు కార్మికులు, ప్రజలు పోరాడుతుంటే వారి ఆందోళనను నీరుగార్చేలాగ ఆయన మాటలున్నాయి. విమల విద్యాలయం విషయంలోనూ ఆయన తీరు ఇంతే. స్టీల్‌ప్లాంట్ నియంత్రణలో నడిచే విమల విద్యాలయంలో టీచర్లు స్వచ్ఛందంగా విఆర్ఎస్‌కు సిద్ధమయ్యారని పేర్కొంటూ



స్కూల్‌ను మూసేసేందుకు స్థానిక ఎంఎల్ఎగా మద్దతు లేఖ ఇవ్వడం తీవ్ర విమర్శలకు గురైంది. ప్రస్తుత అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ విషయంలోనూ ఆయన వ్యవహారం అలాగే ఉంది.

కచ్చితంగా కాలుష్యకాసారం వెదజల్లేదే..

4 మిలియన్ టన్నులు ఉత్పత్తి చేసే ఈ సిమెంట్ ఫ్యాక్టరీతో జనం అల్లాడిపోవడం ఖాయం. ఇప్పటికే అదాని గంగవరం పోర్టు కాలుష్యంతో ఈ ప్రాంత ప్రజానీకం తీవ్ర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. అధికార పార్టీ నాయకులకు వీసమెత్తయినా దీనిపై చలనం రావడం లేదు. అదానీ సిమెంట్ ఫ్యాక్టరీతో ప్రజలకు నష్టం కలుగుతుందని వేల సంఖ్యలో ప్రజలు ఈ నెల 8న నడుపూరు హైస్కూల్ ఆవరణలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఆగ్రహం ప్రదర్శించినా పాలకుల చెవికెక్కడం లేదు. సిమెంట్ ఫ్యాక్టరీకి చెందిన కొంతమంది బినామీదారులు ఇప్పుడు రంగంలోకి దిగారు. ఫ్యాక్టరీ కావాలని విజ్ఞప్తి పత్రాలను అందించేలా ప్రయత్నాలు మొదలుపెట్టారు. రెవెన్యూ కార్యాలయాల్లో వాటిని సమర్పించేందుకు సన్నాహాలు చేయడంపై విశాఖకు చెందిన మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్‌కు తాజాగా లేఖలో తెలియజేశారు. ఫ్యాక్టరీ నిర్మాణ ప్రక్రియను నిలుపుదల చేయాలని ఆయన కోరారు. ప్రజలంతా అదాని సిమెంట్ ఫ్యాక్టరీ వద్దు మొర్రో అంటుంటే మరలా 15 రోజుల్లో పబ్లిక్ హియరింగ్ పెడతామని అధికారులు చెబుతుంటే స్థానిక ప్రజా ప్రతినిధి చొరవ చేసి ప్రభుత్వానికి నివేదించాల్సింది పోయి అదానికి వత్తాసుగా నిలవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బల్క్ డ్రగ్ పనులు చేపడితే ఊరుకోం


పోలీసులను చుట్టుముట్టిన మత్స్యకారులు

ప్రజాశక్తి - నక్కపల్లి : సమస్య పరిష్కారమయ్యే వరకూ బల్క్ డ్రగ్ పనులు నిలుపుదల చేస్తామని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రకటించారని, అలాంటిది పనులు ఎందుకు చేస్తున్నారని రాజయ్యపేట గ్రామానికి చెందిన మత్స్యకారులు పోలీసులను, అధికారులను నిలదీశారు. చందనాడ రెవెన్యూ పరిధిలో పనులు జరుగుతుండగా శనివారం పెద్ద సంఖ్యలో మత్స్యకారులు తరలివెళ్లి పనులు అడ్డగించే ప్రయత్నం చేశారు. ఎస్ఐ సన్ని బాబు, ట్రైనీ ఎస్ఐ సాహిబా అంజుమ్ పోలీస్ సిబ్బందితో కలిసి వారిని నిలువరించారు. దీంతో పోలీసులకు, మత్స్యకారులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రాజయ్యపేట రెవెన్యూలో మాత్రమే పనులు నిలుపుదల చేస్తామని హోం మంత్రి అనిత, తహశీల్దార్ నరసింహమూర్తి చెప్పారని ఎస్ఐ సన్నిబాబు మత్స్యకారులకు బదులిచ్చారు. మిగిలిన రెవెన్యూలో ఎపిఐఐసికి చెందిన పనులు జరుగుతున్నాయని చెప్పారు. దీనిపై స్పందించిన మత్స్యకారులు బల్క్ డ్రగ్ పనులు ఎక్కడా చేపట్టరాదన్నారు. తమ అభిప్రాయాన్ని గౌరవించకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

సుందరీకరణ పనులు వేగవంతం చేయండి

• నగర మేయర్ పీలా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- సీతమ్మధార : భాగస్వామ్య సదస్సు నాటికి విశాఖ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని, సంబంధిత పనులు త్వరితగతిన పూర్తి చేయాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం 3, 5 జోన్ల పరిధిలోని నేషనల్ హైవే, తాటిచెట్లపాలెం , న్యూ కాలనీ రోడ్డు, తెలుగు తల్లి ఫ్లైఓవర్, సంపత్ వినాయక టెంపుల్ రోడ్డు సిరిపురం జంక్షన్ పార్కు హోటల్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో రోడ్లను, ఫుట్‌పాత్‌లు, పలు కూడళ్లలను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. న్యూ కాలనీ రోడ్‌లో సెంటర్ మీడియన్ పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని. తెలుగు తల్లి ఫ్లైవర్ హ్యాంగింగ్ మొక్కలను పూర్తిస్థాయిలో అందమైనవి ఏర్పాటు చేయాలని, సంపత్ వినాయక టెంపుల్ రోడ్డులో రెండువైపులా ఉన్న మొక్కలను మరింత అందంగా తీర్చిదిద్దాలని ద్రోణంరాజు సర్కిల్, సిరిపురం సిఆర్ఆర్ రెడ్డి ఐలాండ్ రెయిలింగ్ పనులు, పార్కు హోటల్ జంక్షన్ వద్ద ఫుట్‌పాత్, కర్బ్ పెయింటింగ్ పనులు పూర్తి చేయాలని జివిఎంసి ప్రధాన ఇంజనీరు పివివి సత్యనారాయణరాజును ఆదేశించారు. ఎపి గ్రీన్ కార్పొరేషన్, జివిఎంసి ఉద్యానవన విభాగం అధికారులు సంయుక్త కార్యాచరణతో నగర సుందరీకరణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో డిఇహెచ్ ఎం. దామోదరరావు, ఇఇలు గంగాధర్, శాంతిరాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

సీతమ్మధార : అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. శనివారం జివిఎంసి 25వ వార్డులో స్థానిక కార్పొరేటర్ సారిపల్లి గోవింద ఆధ్వర్యంలో రూ.2.80 కోట్ల జివిఎంసి నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు సమిష్టిగా కృషి చేస్తున్నామన్నారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనలు, వారి అవసరాల మేరకు . సిసి రోడ్లు, కల్వర్టులు, డ్రైనేజీలు, కమ్యూనిటీ భవనాలు ఇతర అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జివిఎంసి జోనల్ కమిషనర్ శివప్రసాదరావు శ్యామలదీపిక, ఇఇ గంగాధర్, డిఇఇ విజయ్ కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కారు ఢీకొని బైకిస్ట్ మృతి



ఆది హర్షవర్ధన్ (ఫైల్)

ప్రజాశక్తి-వడ్డాది : కారు ఢీకొన్న ప్రమాదంలో బైకిస్ట్ మృతి చెందిన సంఘటన బుచ్చయ్యపేట మండలం కుముందాంపేట సమీపంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివి. కుముదాంపేట గ్రామానికి చెందిన ఆది హర్షవర్ధన్ (18), ఆది భవానీచందు ఇద్దరు యువకులు శనివారం వడ్డాదిలో సినిమా చూసి బైక్‌పై తిరిగి గ్రామానికి వస్తుండగా, కుముదాంపేట గ్రామ సమీపంలోని మలుపు వద్ద చీడికాడ మండలం అప్పలరాజుపురం నుండి వస్తున్న కారు వారి బైకును ఢీకొట్టింది. క్షతగాత్రులను వెంటనే కారులో చోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ, ఆరోగ్యం విషమించి హర్షవర్ధన్ మృతి చెందారు. బైక్ వెనుక కూర్చున్న భవానీచందు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతుని తండ్రి గిరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కరరావు తెలిపారు.

శ్రీవిశ్వ పాఠశాలలో నగదు చోరీ

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని జిఎస్. అగ్రహారం శ్రీ విశ్వ పాఠశాలలో చోరీ జరిగింది. ఈనెల 10న శుక్రవారం అర్ధరాత్రి, గుర్తు తెలియని వ్యక్తి మాస్క్ వేసుకొని అకౌంట్స్ రూమ్ కిటికీ ద్వారా ప్రవేశించి రూ.1.48లక్షల నగదు చోరీ చేశాడు. శనివారం ఉదయం, పాఠశాల అకౌంటెంట్ వారణాసి అనంతకుమార్ అకౌంట్స్ రూమ్ తలుపులను పరిశీలించినప్పుడు నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఆనందపురం క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ ఎ.సత్యారావు కేసు దర్యాప్తు ప్రారంభించారు. సిసి టీవీ ఫుటేజ్‌లో, మాస్క్ ధరించిన గుర్తు తెలియని వ్యక్తి కిటికీ ద్వారా రూమ్‌లోకి ప్రవేశించి చొరబడి నగదు దొంగతనం చేసిన దృశ్యాలు కనిపించాయి.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా

వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల 'ప్రజా ఉద్యమం' పోస్టర్‌ను శనివారం ఉత్తర వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కెకె రాజు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ పేద విద్యార్థులకు వైద్యవిద్య, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తేవాలనే సంకల్పంతో వైసిపి ప్రభుత్వ హయాంలో 17 వైద్య కళాశాలలను మంజూరు చేస్తే, ఇపుడు వాటిని పిపిపి విధానంలో ప్రయివేటుకు కట్టబెట్టే కుట్రలను కూటమి ప్రభుత్వం చేయడం దుర్మార్గమన్నారు. దీనిపై గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు 45 రోజులపాటు కోటి సంతకాల సేకరణ చేపడుతున్నామన్నారు. బిజెపి పాలిత ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వ కాలేజీలను ప్రయివేటుకు అప్పగించారా? అని ప్రశ్నించారు. పార్వతీపురంలో తాము ప్రారంభించిన వైద్యకళాశాలను కూటమి ప్రభుత్వం పూర్తిచేసి ఉంటే కురుపాంలో పచ్చకామెర్లుతో ఇద్దరు గురుకుల విద్యార్థినుల మరణం జరిగేది కాదని, బాధిత విద్యార్థినులకు విశాఖ కెజిహెచ్‌కు వైద్యానికి తెచ్చే అవసరం ఉండేది కాదన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కెకె.రాజు

కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు సాడి పద్మారెడ్డి, కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్ రాజు, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, కెవిఎస్.శశికళ పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- ములగాడ: పిలకవానిపాలెం లక్కీ అమర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఏమిస్ అకాడమీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ స్పోర్ట్స్ మీట్‌ను విశాఖ నగర డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి ప్రారంభించారు. 15 పాఠశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు చెస్, క్యారమ్స్ ఆటల పోటీల్లో పాల్గొంటారు. ఈసందర్భంగా డిప్యూటీ మేయర్ గోవిందరెడ్డి మాట్లాడుతూ, 15 బడ్జెట్ స్కూల్స్ ఏకతాటిపైకి వచ్చి, ఇలా ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎఐఎంఎస్ అకాడమీ స్కూల్ డైరెక్టర్లను అభినందించారు.

నేత్రపర్వంగా సహస్ర నామార్చన

ప్రజాశక్తి వేపగుంట : వరాహలక్ష్మీ నృసింహస్వామి ఆర్జిత సేవల్లో భాగంగా శనివారం సహస్ర నామార్చన నేత్రపర్వంగా సాగింది. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకలో పాల్గొన్న భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామి ప్రసాదాలను అందజేసి, తర్వాత అంతరాలయ దర్శనం కల్పించారు.

అప్పన్న సన్నిధిలో ఎస్‌బిఐ చైర్మన్

ప్రజాశక్తి- వేపగుంట : సింహాద్రి అప్పన్నను ప్రముఖ ఆర్థికవేత్త, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి శనివారం, సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఎఇఒ కె. తిరుమలేశ్వరరావు ఆలయ మర్యాదలు, సంప్రదాయాల ప్రకారం సాదర స్వాగతం పలికారు. కప్పస్తంభ ఆలింగనం, బేడా మండపంలో ప్రదక్షిణలు, స్వామి అంతరాలయ దర్శనం చేసుకున్నారు. సిఎస్.శెట్టి దంపతులను ఆలయ ఎఇఒ కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణ అధికారి కె. వెంకటేశ్వరరావు స్వామి శేష వస్త్రంతో సత్కరించారు. ప్రసాదాలను, స్వామి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో వి. సూర్యనారాయణ పాల్గొన్నారు.

16 నుంచి అనంతుని పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి -పద్మనాభం : మండల కేంద్రంలోని అనంత పద్మనాభస్వామి పవిత్రోత్సవాలను ఈనెల 16 నుంచి 19 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఇఒ పి.లక్ష్మీనరసింహరాజు తెలిపారు. ఆలయంలో ఉత్సవ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని, వేడుకల విజయవంతానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికలను పంపిణీ చేయడంతోపాటు అన్ని గ్రామాల్లో ప్రచారం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, టిడిపి మండల మాజీ అధ్యక్షులు కె.నగేష్ కుమార్, భక్తులు బి సత్యనారాయణ, బి రాము, కె.ఎర్రినాయుడు, జి అప్పలరాజు, ఎం సన్నిబాబు పాల్గొన్నారు.

ఇంటి స్థలాన్ని పరిరక్షించి న్యాయం చేయాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : తాను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఇంటి స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి పరిరక్షించి తనకు అప్పగించడం ద్వారా న్యాయం చేయాలని స్థల యజమాని డాక్టర్ చందక శ్రీకృష్ణ తెలిపారు. శనివారం పౌర గ్రంథాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇతన ప్రైవేట్‌స్థలంలో అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టి ఆక్రమణదారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇపుడు ఆ విగ్రహాన్ని తాను తొలగించాలని చూస్తున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2004లో చిన ముషిడివాడలో అప్పట్లో వుడా నుంచి సర్వే నెంబర్ 164లోని హెచ్ఐజి.ప్లాట్-2, ఇంటి స్థలాన్ని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నా నన్నారు. 2021లో ఆ స్థలంలో ఇంటి నిర్మాణానికి పూనుకోగా కొందరు అడ్డుకున్నారన్నారు. ఇందిరా అనే వ్యక్తి తన మనుసులతో వచ్చి ఆ స్థలాన్ని తక్కువ ధరకు విక్రయించాలని తనను బెదిరించిందన్నారు. తాను ఒప్పుకోకపోవడంతో కొందరు మనుష్యులతో అప్పటికప్పుడే అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టించారని, దీనిపై తాను ప్రశ్నిస్తే, రూ.20లక్షలు నుంచి రూ.25లక్షలు ఇస్తే సైలెంట్‌ైపోతామని బెదిరించారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, నగర పోలీసు కమిషనర్, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.



డాక్యుమెంట్లు చూపుతున్న శ్రీకృష్ణ

భీమిలి సాంస్కృతిక వైభవంపై అధ్యయనం




భీమిలి అందాలపై గీసిన స్కెచ్‌లతో గీతం ఆర్కిటెక్చర్ విద్యార్థులు

ప్రజాశక్తి- భీమిలి : భీమిలి సాంస్కృతిక నిర్మాణాన్ని అర్థం చేసుకోవడం, దాన్ని డాక్యుమెంట్ చేయడం కోసం శనివారం గీతం వర్సిటీ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ పత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమిలి ప్రాచీన తీర నగరపు ప్రత్యేకతను నిర్వచించే అనేక అంశాలను అధ్యయనం, సర్వే చేసిన గీతం బిఆర్క్, ఎంఆర్క్ విద్యార్థులు, ప్రకృతి, చరిత్ర, మానవ చర్యలు కలిసి ఈ తీరప్రాంత వారసత్వ పట్టణానికి ఎలా స్వరూపం ఇస్తాయో స్పష్టత ఇవ్వాలని అవగాహనకు వచ్చినట్లు విద్యార్థులు తెలిపారు. బిఆర్క్ విద్యార్థులు నిర్వహించిన స్కెచింగ్ వర్క్‌షాప్‌లో భీమిలి పట్టణంలోని చారిత్రక వైభవాన్ని, ప్రకృతి శోభను అక్కడి డచ్. కాలనీయ శైలిలో నిర్మిత నిర్మాణాలను, చురుకైన తీరప్రాంతాలను. భూమి-సముద్రాల సజీవ మేళాన్ని స్కెచ్ చేశారు. భీమిలి సాంస్కృతిక పారంపర్యాన్ని మ్యాపింగ్ చేసిన గీతం ఆర్కిటెక్చర్ విద్యార్థులకు ఈ అధ్యయనయాత్ర, వర్క్‌షాప్ ప్రేరణాత్మకమైన అనుభవంగా నిలిచిందని గీతం స్కూల్ ఆఫ్ ఆర్కి టెక్చర్ డీన్ విభూతి సత్యదేవ్ తెలిపారు.

రోడ్డుపై నీటి ప్రవాహంతో ఇక్కట్లు

• అనునిత్యం రాకపోకలకు జనం అవస్థలు • పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి 4,5 వార్డుల పరిధిలో ఉన్న పాత పరదేశిపాలెం వంతెనపై రహదారిలో రొయ్యల కంపెనీల నుంచి వెలువడిన వ్యర్థాల మురుగునీరు నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక. శుక్రవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి పరదేశిపాలెం జాతీయ రహదారి నుంచి పాతపరదేశిపాలెం వెళ్లే దారిలో ఉన్న వంతెన పైనుంచి శనివారం ఉదయానికి కూడా నీరు ప్రమాదకరంగా ప్రవహించడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. దీంతో కొండపేట నూతన కాలనీ, పాత పరదేశిపాలెం, కె.నగరంపాలెం ప్రజలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల ఈ వంతెనను జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, జోన్ కమిషనర్లు ఉమ్మి అయ్యప్పనాయుడు, కె. కనకమహాలక్ష్మి, తహశీల్దార్ పరిశీలించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని వంతనపై మురుగు, వరదనీటి సమస్య నుంచి విముక్తి కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



పరదేశీపాలెం వంతెనపై నిలిచిన నీరు

భెల్ గుర్తింపు ఎన్నికలకు సన్నాహాలు



విశాఖలోని భెల్ యూనిట్

ప్రజాశక్తి -గాజువాక :విశాఖ భెల్ యూనిట్‌లో గుర్తింపుసంఘం ఎన్నికలకు సన్నాహాలు మొదలయ్యాయి. ఈ మేరకు హైదరాబాదు లేబర్ కమిషనర్ నుంచి స్థానిక భెల్ యాజమాన్యానికి ఉత్తర్వులు అందాయి. సంస్థలోని అన్ని రిజిస్టర్ యూనియన్లు, తమ ఒరిజినల్ డాక్యుమెంట్స్ స్థానిక యాజమాన్యానికి పది రోజుల్లోపుగా సమర్పించాలని ఉత్తర్వుల్లో పాల్గొన్నారు. వాటి ఆధారంగా ఎన్నికలు నిర్వహించనున్నారు. కాగా విశాఖ భెల్ యూనిట్‌లో గుర్తింపుసంఘానికి 2023 ఆగస్టు 31న చివరిసారిగా ఎన్నికలు జరగ్గా అప్పట్లో యునైటెడ్ ఫ్రంట్ గెలుపొందింది. ఆ కమిటీ పదవీకాలం ఈ ఏడాది ఆగస్టు నెలాఖరుతో ముగియడంతో కొత్తగా ఎన్నికలకు సన్నాహాలు మొదలయ్యాయి. భెల్‌లో బిహెచ్‌పివి విలీనమైన తర్వాత ఐదోసారి ఎన్నికలు జరగనుండగా, ప్రస్తుతం 340మంది ఓటర్లున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు ఆరిలోవ కాలనీ వార్డు కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు శనివారం పుష్ కార్టులను కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ అందజేసారు. వార్డు పరిధిలోని 9 సచివాలయాలకు రెండేసి పుష్ కార్టుల చొప్పున అందజేసారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సునీత మాట్లాడుతూ వార్డు పరిధిలో పారిశుధ్య, కార్మికుల సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తెస్తే ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, సచివాలయ కార్యదర్శులు, సూపర్‌వైజర్లు, పాల్గొన్నారు.

ఐహెచ్‌ఆర్‌సి సభ్యుల నియామకం

ప్రజాశక్తి- పెందుర్తి: నాయుడు తోటలోని ఐహెచ్‌ఆర్‌సి జాతీయ ప్రధాన కార్యాలయంలో సంస్థ జాతీయ అధ్యక్షులు రాజాన ప్రసాదరావు ఆధ్వర్యంలో శనివారం సాధారణ సభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగాపలువురు నూతన సభ్యుల నియామకం జరిగింది. ఎపి స్టేట్ ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ ప్రెసిడెంట్‌గా ఎం కల్యాణ్ కుమార్, యూత్ జనరల్ సెక్రెటరీగా జి.తిలక్‌సాయి, అనకాపల్లి జిల్లా సెక్రెటరీగా డి బాబ్జిలను నియమించారు ఈ సందర్భంగా రాజాన ప్రసాదరావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చైతన్యపరచడంతోపాటు డ్రగ్స్, బెట్టింగ్‌యాప్స్‌పై విద్యాసంస్థలు, గ్రామాల్లో చైతన్యసదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. సేవా కార్యక్రమాల్లో సభ్యులందరూ పాల్గొనాలని కోరారు.

స్మైల్ కేర్ డెంటల్ హాస్పిటల్ ప్రారంభం



స్మైల్ కేర్ హాస్పిటల్ ప్రారంభిస్తున్న సతీష్‌కుమార్, శివనాగేందర్ రెడ్డి

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఎన్ఎడి జంక్షన్ బుచ్చిరాజుపాలెం దరిలో స్మైల్‌కేర్ సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్‌ను శనివారం ప్రారంభించారు. స్మైల్ కేర్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ శివనాగేందర్ రెడ్డితో కలిసి ముఖ్యఅతిథి కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి సతీష్‌కుమార్ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ డాక్టర్ శివనాగేందర్ రెడ్డి చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు, డాక్టర్ శివ నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ స్మైల్ కేర్ డెంటల్ హాస్పిటల్ ప్రారంభించిన సందర్భంగా అక్రిడిటేషన్ కార్డులున్న జర్నలిస్టులకు 50శాతం రాయితీతో వైద్యం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, రాజకీయ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు

అదాని అంబుజా సిమెంట్‌పై

ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయండి

వామపక్ష పార్టీలు డిమాండ్



అభివాదం చేస్తున్న వామపక్ష పార్టీల నేతలు

ప్రజాశక్తి - గాజువాక : కాలుష్య కారక అదానికి చెందిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీపై ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పోతన సన్యాసిరావు భవన్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ ఈ నెల 8న జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలందరూ ఫ్యాక్టరీ వద్దని ముక్తకంఠంతో తేల్చిచెప్పినా, మరలా 15 రోజుల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇది దుర్మార్గమన్నారు. ఇప్పటికే గాజువాక ప్రజానీకం అదాని గంగవరం పోర్టు కాలుష్యంతో అనారోగ్యాల బారిన పడుతున్నారని తెలిపారు. అదాని సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణమైతే 10 లక్షల మంది ఇబ్బందులు పాలవుతారన్నారు. దీని ప్రభావం ఎన్ఎడి కొత్త రోడ్డు వరకు ఉంటుందని తెలిపారు. పబ్లిక్ హియరింగ్ జరపబోమని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించాలన్నారు. ప్రజల ప్రాణాలు ముఖ్యమని ఆయన గుర్తెరగాలన్నారు. ఫ్యాక్టరీ పెట్టడానికి రెండోసారి ప్రజాభిప్రాయ సేకరణకు పూనుకుంటే పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సిపిఐ కార్పొరేటర్ ఎజె.స్టాలిన్ మాట్లాడుతూ జనావాసాల్లో అదాని సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఉక్కు భూముల్లో సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మిస్తున్నారని తెలిపారు. సిపిఐ ఎంఎల్ ఏరియా కమిటీ కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగాలు, ఫ్యాక్టరీ పేరిట ప్రజలను మోసం చేయెుద్దన్నారు. సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ ప్రజా పోరు నాయకులు దేవా మాట్లాడుతూ జనావాసాల మధ్య ఫ్యాక్టరీ పెడితే ప్రజల ఆరోగ్యాలకు తీవ్ర నష్టం కలుగుతుందని, భూగర్భ జలాలు కలుషితమవుతాయని అన్నారు. సమావేశంలో సిపిఎం నాయకులు కెఎం.శ్రీనివాసరావు, నమ్మి రమణ, రామారావు, పి.పైడిరాజు, లోకేష్, సిపిఐ నాయకులు కె.సత్యనారాయణ, డి.ఆది నారాయణ పాల్గొన్నారు.

క్రీడా గాయాలకు అత్యాధునిక చికిత్స

సౌత్‌ఇండియాలో తొలిసారిగా విశాఖ మెడికవర్ ఆసుపత్రిలో ఎసిఎల్ చికిత్స



వివరాలు వెల్లడిస్తున్న మెడికవర్ వైద్యనిపుణులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : క్రీడా గాయాల చికిత్సలో కీలక ముందడుగుగా, నగరంలోని మెడికవర్ హాస్పిటల్ ఎంవిపి యూనిట్ దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి అత్యాధునిక యాంటీరియర్ క్రూసియేట్ లిగమెంట్ (ఎసిఎల్) పునర్నిర్మాణ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. ఏడాది కాలంగా తీవ్రమైన మోకాలి నొప్పి, కీలు అస్థిరతతో బాధపడుతున్న 23 ఏళ్ల శ్యామ్ అనే యువ క్రీడాకారుడికి సీనియర్ ఆర్థ్రోస్కోపిక్ నిపుణుడు, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శ్రీధర్ గంగావరపు నేతృత్వంలోని వైద్య బందం ఈ అరుదైన శస్త్రచికిత్సను పూర్తి చేసింది. ఎంఆర్ఐ స్కానింగ్‌లో ఎసిఎల్ పూర్తిగా చిరిగిపోవడం, మెనిస్కస్ గాయం, కీలు అస్థిరతకు దారితీసే లూజ్ లిగమెంట్స్ ఉన్నట్లు నిర్ధారించిన వైద్యబృందం రోగి వేగంగా కోలుకోవడానికి, లిగమెంట్ బలంగా పెరగడానికి, బయో సపోర్ట్ మెటీరియల్‌ను చికిత్సలో ఉపయోగించింది. గాయపడ్డ మెనిస్కస్‌ను మరమ్మతు చేయడంతో రోగి మోకాలి కదలిక సాఫీగా మారింది. శస్త్రచికిత్స అనంతర పరిణామాలు సంతృప్తికరంగా ఉన్నాయని, రోగి ఇప్పటికే ఫిజియోథెరపీని ప్రారంభించాడని వైద్యులు తెలిపారు. త్వరలోనే క్రీడా కార్యకలాపాలకు, సాధారణ జీవితానికి తిరిగి చేరుకోగలడన్నారు. ఈ సందర్భంగా ఇండియన్ ఆర్థ్రోస్కోపీ సొసైటీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ శ్రీధర్ గంగవరపు, మాట్లాడుతూ ఆధునిక సాంకేతికత క్రీడా గాయాల చికిత్సలోకొత్త శకానికి నాంది పలికిందన్నారు. మెడికవర్ సెంటర్ హెడ్ డాక్టర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ, దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా ఆధునిక శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన మెడికవర్ వైద్యబృందాన్ని అభినందించారు. సమావేశంలో మార్కెటింగ్ హెడ్ శ్రీనివాస్ ఉన్నారు.

విలువలతో కూడిన విద్య అభ్యసించాలి

ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ చిరంజీవిరావు



పుస్తకాలిస్తున్న ఎమ్మెల్సీ వేపాడ, సినీనటుడు ఆర్.నారాయణమూర్తి

ప్రజాశక్తి- తగరపువలస : ప్రతిఒక్కరూ విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని ఎమ్మెల్సీ, ప్రభుత్వవిప్ వేపాడ చిరంజీవి రావు విద్యార్థులకు సూచించారు. శనివారం చిట్టివలస జెడ్‌పి హైస్కూల్‌లో ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎంఎంఎస్ ఉచిత శిక్షణా తరగతులను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చదువు ప్రాధాన్యతను వివరించారు. చదువుకు పేదరికం ఆటంకం కాదన్నారు. తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం గర్వపడేలా ప్రతిఒక్కరూ ఉన్నత చదువులు చదివి సమున్నత స్థానంలో నిలబడాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.విద్యార్థుల అభిరుచులను అడిగి తెలుసుకున్నారు. వారి ఆకాంక్షలను అభినందించారు. ప్రత్యేక అతిథి సినీ దర్శకులు, నటులు ఆర్ నారాయణ మూర్తి మాట్లాడుతూ, ఆంగ్ల భాష అవసరాన్ని, అవశ్యకతను వివరిస్తూనే, తెలుగు భాష గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని దూరం చేసుకోరాదని హితవు పలికారు. ఉపాధి, ఉద్యోగావకాశాలు లభించాలంటే పోటీ పరీక్షలకు సిద్ధపడాలని సూచించారు. ఏటా 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. వింగ్స్ ఫౌండేషన్ ప్రతినిధి కె ఆనంద్ తన సొంత నిధులతో సమకూర్చిన 100 పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. హైస్కూల్ హెచ్ఎం,దొడ్డి ఆదినారాయణ, ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకులు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, విశ్రాంత హెచ్ఎం పొట్నూరు మురళీ మోహనరావు పాల్గొన్నారు

న్యాయం కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి- పెందుర్తి : వైసిపి ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీ ఇళ్లస్థలాలకు తమ వద్ద నుంచి బలవంతంగా ఐదెకరాల భూమిని లాక్కొన్న ప్రభుత్వం, అధికారులు నేటికీ తమకు న్యాయం చేయలేదని నిర్వాసిత రైతులు ఎర్ర వెంకటరమణ, ఎర్ర సింహాచలం, కె.కనకరాజు, ఎర్ర సత్తిబాబు వాపోతున్నారు. అదే భూమిని నమ్ముకుని, అందులో పండించిన పంట ఫలసాయంతో జీవనోపాధి పొందుతున్న తాము వద్దని మొరపెట్టుకున్నా దౌర్జన్యంగా భూమిని లాక్కొన్నారని, అయితే నేటికీ తమకు నష్టపరిహారం ఇవ్వలేదని అంటున్నారు. కావాలనే అధికారులు తాత్సారం చేస్తుండడంతో కోర్టును ఆశ్రయించామన్నారు. ఎన్నికలకు ముందు తమకు న్యాయం చేస్తామని కూటమి నాయకులు హామీఇచ్చారని, అయినా నేటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి తమకు న్యాయమైన పరిహారం చెల్లించాలని వేడుకుంటున్నారు.

ఆలయ ఇఒగా లక్ష్మీనరసింహరాజు

ప్రజాశక్తి -పద్మనాభం. స్థానిక అనంతపద్మనాభ స్వామి దేవస్థానం ఇఒగా పి లక్ష్మీ నరసింహరాజు శనివారం మాధవస్వామి ఆలయంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. జిల్లా దేవాదాయ శాఖ అధికారుల నుంచి జారీ అయిన ఉత్తర్వుల మేరకు ఆయన విధుల్లో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అందరి సమన్వయం, సహకారంతో అలయ అభివృద్ధి, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడతానన్నారు

దుర్గాదేవిని దర్శించుకున్న వెలగపూడి

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పెదగదిలి శివాలయం వద్ద జనసేన నాయకులు ధూళి రఘు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గాదేవి ఉత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శనివారం పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షులు గాడి సత్యం, టిడిపి పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి పోలారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు..

మృతుని కుటుంబానికి బాసట

ప్రజాశక్తి- సీతమ్మధార : కేన్సర్‌తో మరణించిన జివిఎంసి 26 వ వార్డు, రామకృష్ణానగర్, రజక వీధికి చెందిన ఎల్దూటి సురేష్ కుటుంబానికి స్థానిక నాయకుడు పోతు సత్యనారాయణ అండగా నిలిచారు. శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, మృతుని భార్య సావిత్రికి రూ.5 వేల నగదు, రూ.5 వేల విలువచేసే నిత్యావసర సరుకుల అందజేశారు కార్యక్రమంలో స్థానిక పెద్దలు రామదుర్గ, రజక సేవా సంఘం పెద్దలు చిన్నా ,ఈశ్వరరావు, సూరిబాబు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడోవారు గొల్లలపాలెం కెజిబివికి వెళ్లే మార్గంలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు శని వారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు ఎస్‌ఇ వెంకటవాసు, డిఇఇ సురేష్, వర్క్ఇన్స్పెక్టర్ విజయ్, టిడిపి నేతలు కె నాగరాజు, ఎం సంజీవ్ కుమార్, జె మురళి, వి పోతురాజు పాల్గొన్నారు

అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 87వ వార్డు కణితి గాంధీబొమ్మ సెంటర్‌లోని కోదండరామ ఆలయ ప్రాంగణంలో పంచముఖేశ్వర స్వామి దేవాలయం ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా జరిగాయి. శనివారం వేడుకల ముగింపు సందర్భంగా వడ్లపూడిలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. వైసిపి గాజువాక నియోజకవర్గ ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, సింహాద్రి ప్రొప్రైటర్ ,సిగిలిపల్లి రవి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కల్తీ మద్యంపై సమగ్ర విచారణ జరపాలి

- కల్లుగీత వృత్తిని లేకుండా చేయాలనుకుంటే పాలకులకు భవిష్యత్ ఉండదు
- ఎపి కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యర్రా దేముడు

ప్రజాశక్తి-అనకాపల్లి : కల్తీ మద్యం పరిశ్రమలపై సమగ్ర విచారణ చేయాలని ఎపి కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యర్రా దేముడు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం సంఘం జిల్లా అధ్యక్షులు బత్తిన నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దేముడు మాట్లాడుతూ ప్రభుత్వంలోని కొందరు పెద్దల అండదండలతోనే కల్తీ మద్యం కుటీర పరిశ్రమలుగా సాగుతోందని తెలిపారు. స్పిరిట్‌తో కల్తీ మద్యం తయారు చేసి ప్రజల ప్రాణాలతో చలగాటమాడుతున్నారని మండిపడ్డారు. ఎన్నో పోషక విలువలు ఉన్న అనేక జబ్బులకు వైద్యంలా ఉపయోగపడే ప్రకృతి సహజ సిద్ధమైన తాటికల్లును టిడిపి కూటమి ప్రభుత్వం కనుమరుగు చేస్తుందని తెలిపారు. గీత కార్మికులు 80 సంవత్సరాల నుండి అనేక పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులు, ఎక్స్‌గ్రేషియాను గత చంద్రబాబు పాలనలో రద్దు చేశారని చెప్పారు. అంతేకాకుండా గీత కార్మికులను కులాలుగా చీల్చి గీత వృత్తిని దెబ్బతీశారన్నారు. కల్లుగీత వృత్తిని లేకుండా చేయాలనుకుంటే పాలకులకు భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు. రాష్ట్రంలో ఉన్న 75 వేల అక్రమ బెల్ట్ షాపులను తక్షణమే తొలగించాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు బత్తిన నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొత్త కొత్త యంత్రాలతో కుటీర పరిశ్రమలుగా విస్తరించిన స్పిరిట్ మద్యాన్ని తక్షణం అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ నాయకులు గండిబోయిన రాము, కె.ఈశ్వరరావు, కర్రి అప్పలరాజు, దొడ్డి నారాయణ, దొడ్డి నారాయణరావు, అనుసూరి నూకప్పరావు, పాత బాబు, నడిగట్ల తాతబాబు, నడిగట్ల సన్యాసిరావు, కాకర సుబ్బారావు, ఎల్ రామానాయుడు, శెట్టి రమణ, లావేటి పకీరు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేముడు



నిండుకుండలా ఉన్న సుంకపూరు చెరువు

నిండుకుండల్లా చెరువులు

ప్రజాశక్తి-కోటవురట్ల : ఇటీవల కురిసిన వర్షాలకు మండల వ్యాప్తంగా చెరువులు నిండు కుండలను తలపిస్తున్నాయి. దీంతో చెరువుల కింద వరి సాగు ఆశాజనకంగా ఉంది. ప్రధానంగా మండలంలో తాండవ కాలువ కింద, దుర్గాడ కాల్వ కింద ఎక్కువ చెరువులు ఉండడంతో పాటు వాటిపై ఆధారపడే ఆయకట్టు కూడా అత్యధికంగా ఉండడంతో ఖరీఫ్ సీజన్‌కు నీటి అంతరాయం ఉండదని రైతులు భావిస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో జీడి మామిడి తోటలకు కూడా చెరువు నీటిని వినియోగించుకుంటున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ ఏడాది సాగునీటికి ఇబ్బంది లేకుండా ఖరీఫ్ సీజన్ అనుకూలంగా ఉందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

ప్రజల నుండి వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ప్రజల నుండి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. వాటిపై వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే కొణతాల ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తున్నారని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం కొణతాల రామకృష్ణను మహాత్మ జ్యోతిబాపూలే బిసి వెల్ఫేర్ స్కూల్ ప్రిన్సిపల్ ఉషారాణి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. స్కూల్ సమస్యలను రామకృష్ణ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మాజీ మంత్రి గురునాథరావుకు నివాళి

ప్రజాశక్తి-కశింకోట : మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు 70వ జయంతి వేడుకలు శనివారం జరిగాయి. ఇందులో భాగంగా కశింకోటలోని బస్సు స్టాండ్ వద్ద ఉన్న గురునాథ్‌రావు విగ్రహానికి వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కలగ లక్ష్మి గున్నయ్యనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, కసింకోట గ్రామ సర్పంచ్ జయరజని, యువజన నాయకులు దివాకర్, అచ్చర్ల సర్పంచ్ సోమేశ్వరరావు, గోకివాడ గోవిందా, గంగాధర్ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం దిబ్బిడి గ్రామంలో గుడివాడ గురునాథరావు జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి దొండా రాంబాబు, వైసిపి నాయకులు కొల్లమల్ల అచ్చంనాయుడు, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు జయంతి కార్యక్రమం విశాఖలో ఘనంగా జరిగింది. ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలిలోని ఆయన విగ్రహానికి మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యాన నాయకులంతా పూలమాలలు వేసి నివాళ్ళర్పించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు, అరకు పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ తనుజా రాణి, మాజీ ఎమ్మెల్యేలు ఎ.అదీప్ రాజ్, చింతలపూడి వెంకటరామయ్య, వైసిపి సమన్వయకర్తలు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, జివిఎంసి కార్పొరేటర్లు పాల్గొన్నారు.



గురునాథరావు విగ్రహానికి పూలమాల వేస్తున్న అమర్‌నాథ్

వికలాంగుల సమస్యలపై వినతి


ప్రజాశక్తి-అనకాపల్లి : వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం అనకాపల్లి విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పాత్రపల్లి వీరు యాదవ్ ఆధ్వర్యంలో అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్‌కు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో గడిచిన మూడేళ్లుగా వికలాంగుల పరికరాల గుర్తింపు శిబిరాలు ఏర్పాటు చేయలేదని, కేంద్ర మంత్రితో మాట్లాడి ఎంపి ల్యాండ్స్ మీద గుర్తింపు శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులైన వారికి బ్యాటరీ మోటరైజ్డ్ సైకిల్స్, ట్రై సైకిల్స్, వీల్ చైర్స్, చెవిటి మిషన్లు తదితర పరికరాలు పంపిణీకి ఏర్పాటు చేయాలన్నారు.

ఎన్‌టిఆర్ మార్కెట్ యార్డు పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి ఎన్టీఆర్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్‌గా పచ్చికూర రాము, వైస్ చైర్మన్ సత్యనారాయణ, డైరెక్టర్లు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపి సీఎం రమేష్, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, రాష్ట్ర గవర కార్పొరేషన్ మల్ల సురేంద్ర తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ రాము మాట్లాడుతూ మార్కెట్ యార్డులో రైతు బజారు ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, అనకాపల్లి నియోజకవర్గ కూటమి నాయకులు, రైతులు, పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గానికి అభినందనలు

కశింకోట : అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులుగా పచ్చికూర రాము, ఉపాధ్యక్షులుగా కర్రి సత్యనారాయణ, డైరెక్టర్‌గా నైనంశెట్టి వరలక్ష్మి శనివారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వారికి టిడిపి మండల అధ్యక్షులు గొంతిన శ్రీనివాసరావు సాలువతో సన్మానం చేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రి డైరెక్టర్ ఉల్లింగల రమేష్, నైనంశెట్టి రమణరావు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అచ్చర్ల గ్రామానికి చెందిన నైనంశెట్టి వరలక్ష్మి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ఆ గ్రామస్తులు భారీగా తరలివెళ్లారు.



నైనంశెట్టి వరలక్ష్మిని అభినందిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

అధ్వానంగా పరవాడ శ్మశానవాటిక

- అపారిశుద్ధ్యంతో వెదజల్లుతున్న దుర్గంధం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి-పరవాడ

స్వచ్ఛ భారత్, స్వచ్ఛతా హీ సేవా, స్వర్ణాంధ్ర ప్రదేశ్- స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ అంటూ ప్రభుత్వాలు ఊదరగొట్టే ప్రచారాలు చేయడం తప్పా ఆచరణలో ఎక్కడా పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారిస్తున్న దాఖలాల్లేవు. ఫొటోలు కోసం ఫోజులిస్తున్నారు గాని పారిశుధ్యం నిర్వహణ పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదు. మండల కేంద్రం పరవాడ గ్రామ శ్మశాన వాటిక పరిసరాలే ఇందుకు నిదర్శనం.

పరవాడ మేజర్ పంచాయతీ పరిధిలోని ప్రధాన శ్మశాన వాటిక అధ్వాన స్థితిలో ఉంది. పరవాడ గ్రామానికి సమీపంలోని సంత బజారుకు ఆనుకుని, పరవాడ-అనకాపల్లి ప్రధాన రహదారి పక్కన ఉన్న ఈ శ్మశాన వాటికలో ప్రస్తుతం దహన సంస్కారాలు నిర్వహించడమే కష్టంగా మారింది. శ్మశాన వాటిక చుట్టుపక్కల ప్రాంతాల్లో పందుల వ్యర్థాలు, కోళ్ల మిగులు అవశేషాలతో పాటు పిచ్చి తుప్పలతో పేరుకుపోయి భరించరాని దుర్వాసన వ్యాపిస్తోంది. గాలిలో వ్యాపించే ఆ దుర్గంధం కారణంగా వాహనదారులు, పాదచారులు, ముఖ్యంగా మృతదేహాలను దహనం చేసేందుకు వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మృతదేహాలను దహనం చేసే సమయాల్లో దుర్వాసన భరించలేక ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. పందుల వ్యర్థాలు, చనిపోయిన జంతువుల అవశేషాలు శ్మశానానికి అతి సమీపంలోనే పడేస్తున్నారు. దీని వల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, పంచాయతీ అధికారులకు సైతం సమస్య తెలిసినప్పటికీ ఇప్పటి వరకు పారిశుధ్య చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. కోళ్ళ, పందుల వ్యర్థాల వదిలే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం లేదని చెబుతున్నారు. శ్మశాన వాటికలో శుభ్రతా కార్యక్రమాలు చేపట్టకపోవడంతో మృతులకైనా గౌరవం లేని పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు స్పందించి శ్మశానవాటికలో ఉన్న తుప్పలు, చుట్టూ ఉన్న అపారిశుధ్యాన్ని తొలగించాలని, వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఏపుగా తుప్పలు పెరిగి ఉన్న పరవాడ శ్మశాన వాటిక ఇదే...

మూగజీవాలకు అందని వైద్యం

- నాలుగు నెలల క్రితం పశువైద్యాధికారి బదిలీ
- నేటికీ డాక్టర్‌ను నియమించని వైనం
- వ్యాధుల సీజన్ కావడంతో ఆందోళన చెందుతున్న రైతులు
- 3 నెలలుగా జీతం లేక ఇబ్బంది పడుతున్న అటెండర్



వడ్డాది పశు వైద్యశాల

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం వడ్డాది పశువుల ఆసుపత్రిలో పశువైద్యాధికారి లేకపోవడంతో మూగ జీవాలకు వైద్య సేవలు అందని పరిస్థితి నెలకొంది. వ్యాధుల సీజన్ కావడంతో పాడిరైతులు, జీవాల పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు.

వడ్డాది పశువైద్యశాల వైద్యాధికారి నాలుగు నెలల క్రితం బదిలీ అయ్యారు. నాటి నుండి ఈ వైద్యశాలకు కొత్త డాక్టర్‌ను ఉన్నతాధికారులు నియమించలేదు. ప్రస్తుతం ఆఫీసు సబార్డినేట్ రమ ఒక్కరే ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. ఈమెకు గత మూడు నెలల నుండి జీతాలు అందలేదు. ఆసుపత్రికి డాక్టర్ లేకపోవడం వలన ఈమెకు జీతాలు బిల్లు పెట్టేవారు లేరు. దీంతో ఆమె తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతుంది. ఆమె ప్రతిరోజు ఆసుపత్రి తెరిచి చిన్నచిన్న వ్యాధులకు మందులు ఇస్తున్నారు. అప్పుడప్పుడు బుచ్చయ్యపేట ఎల్ఎస్ అప్పలరాజు వచ్చి చిన్నచిన్న వ్యాధులకు సేవలు అందిస్తున్నారు. ఈ వైద్యశాలలో పూర్తిస్థాయిలో పశు వైద్య సేవలు అందకపోవడంతో 30 గ్రామాల పశు, జీవాల పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వర్షాల సీజన్ కారణంగా పశువులు వ్యాధుల బారిన పడుతున్నాయి. ఇటీవల అద్రావు తమన్న దొర అనే రైతు తన ఆవుకి దూడకు వైరస్ అవుతుందని ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యుడు లేకపోవడంతో వాటికి వైద్య సేవలు చేసే పరిస్థితి లేకపోయింది.

వైద్యాధికారిని రిలీవ్ చేసిన పశు సంవర్ధకశాఖ ఉన్నతాధికారులు వేరే డాక్టర్ను నియమించకపోవడంపై పాడి రైతులు, గొర్రెలు, మేకలు పెంపకందారులు మండిపడుతున్నారు. ఇటీవల కాలంలో దూడలు, మేకలు, గొర్రెలపై కుక్కల దాడులు ఎక్కువై గాయాలపాలైన వాటిని ఆసుపత్రికి తీసుకొస్తే అత్యవసర చికిత్సలు అందే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం డిప్యుటేషన్‌పై కూడా డాక్టర్‌ను నియమించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పశు వైద్యాధికారి నియమించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


మాట్లాడుతున్న బాధిత రైతులు

ధాన్యం బస్తాలు, నాటు కోళ్లు అపహరణ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండల కేంద్రం బుచ్చయ్యపేట గ్రామంలోని సుంకర, శనివాడ వారి కల్లాల వద్ద శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రైతులకు చెందిన ధాన్యం బస్తాలు, నాటు కోళ్లు అపహరించారు. రైతులు రాత్రి 7 గంటల వరకు కల్లాల వద్ద పనులు చేసుకొని ఇంటికి చేరుకున్నారు. శనివారం తెల్లవారి వెళ్లి చూసేసరికి ధాన్యం బస్తాలు, కోడిపుంజులు అపహరణకు గురైనట్లు గుర్తించారు. సుంకర నాగరాజుకు చెందిన 3 ధాన్యం బస్తాలు 8 కోడి పుంజులు, సుంకర కొండబాబుకు చెందిన 6 కోడి పుంజులు, 6 ధాన్యం బస్తాలు, సుంకర అప్పారావుకు చెందిన ఒక కోడి పుంజు, సుంకర చినబాబుకు కోడి పుంజు, సుంకర శ్రీనుకు చెందిన రెండు కోళ్లు దొంగిలించుకుపోయారు. వీటి విలువ రూ.80 వేలు ఉంటుందని రైతులు వాపోయారు. పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని రైతుల కోరుతున్నారు.


ఈశ్వరరావును పరామర్శిస్తున్న ప్రసాద్, అదీప్‌రాజ్ తదితరులు

క్షతగాత్రునికి వైసిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పైడివాడ అగ్రహారం పంచాయతీ పైడివాడకు చెందిన సీనియర్ వైసీపీ నాయకులు దాసరి ఈశ్వరరావు శుక్రవారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైసిపి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, పెందుర్తి వైసీపీ నేత గండి రవికుమార్, సర్పంచ్ వడ్డాది అప్పలరాజు ఆసుపత్రికి వెళ్లి ఈశ్వరరావును పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈశ్వరరావుకు అన్ని విధాలుగా తాము అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

సొంత నిధులతో గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పినగాడి- కె.కోటపాడు రోడ్డులో మల్లునాయుడు పాలెం వద్ద రోడ్డు గుంతలు పడి ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, బస్సులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో మల్లు నాయుడుపాలెం సర్పంచ్ బోను దేవుడమ్మ గంగు నాయుడు ముందుకు వచ్చి తమ సొంత నిధులతో రోడ్డు గుంతలను పూడ్చారు. దీంతో గ్రామస్తులు సర్పంచ్‌ను అభినందించారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల డబ్బు మహోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లి పట్టణంలో ప్రసిద్ధి చెందిన కుంచావారి శ్రీగౌరీ పరమేశ్వరుల నిలుపుదల మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. రఘురాం లేఔట్ వద్ద వరి డుబ్బుకు ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. శ్రీగౌరీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేసి మొదటి పూజలు కుంచా వారి కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుంచా వారి కుటుంబ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


వరి డుబ్బు తెస్తున్న నిర్వాహకులు

పలుచోట్ల బాలికా దినోత్సవం


తాళ్లపాలెం స్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఎఎంఎఎల్ కళాశాలలో శనివారం ప్రపంచ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న వివక్షను రూపుమాపాలని కోరుతూ 1911లో అమెరికా సామాజిక ఉద్యమకారిణి ఎలనార్ రోజ్‌వెల్ట్ యుఎన్ఒలో తీర్మానం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఆమె పుట్టిన రోజున ప్రపంచ బాలికల దినోత్సవంగా 1912లో ప్రకటించినట్లు చెప్పారు. నేటికీ బాలికలపై వివక్ష కొనసాగుతూనే ఉందని, ఇది చాలా బాధాకరమైన విషయంగా పరిగణలోకి తీసుకుని మార్పుకు నాంది పలకాలని హితవుపలికారు. కార్యక్రమంలో కళాశాల వుమన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ సామ్రాజ్యం, వైస్ ప్రిన్సిపాల్ టి.నిరంజన్ కుమార్, సూపరింటెండెంట్ వి.అనురాధ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కశింకోట : ప్రపంచ బాలికల దినోత్సవంలో భాగంగా మండలంలోని తాళ్ళపాలెం బాలికల గురుకుల, జెడ్‌పి హైస్కూల్లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శనివారం కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్ వైజర్ సునీత బాలికల పోషకాహారం, పరిశుభ్రత, బాల్య వివాహాల నివారణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతమ్మధార : అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుండి సత్యం కూడలి మీదుగా నిర్వహించిన ర్యాలీని డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు.ఐసిడిఎస్ పీడీ. కెవి.రామలక్ష్మి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ లూసీ, డెమో బి.నాగేశ్వరరావు, .డిపిహెచ్ఎన్ఒ ఎం.సత్యవతి, ఆర్‌బిఎస్‌కె డాక్టర్ బి.హారిక, ఎఎన్ఎంలు, ట్రైనీ నర్స్‌లు, ఆశాలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పెందుర్తి : స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విభాగం కోఆర్డినేటర్ జి.మంజుల ఆధ్వర్యంలో బాలికా సాధికారితపై విద్యార్థులు నవ్యశ్రీ, గుణగాయత్రి, లత,.శివాని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.కళాశాల సెక్రటరీ టి.థియోఫిలస్, ప్రిన్సిపాల్ ఎన్ఇ ఫ్లోరా, ఎఐ రవిబాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్స్ ఎన్.సంధ్యా రాణి, జి.మంజుల పాల్గొన్నారు

విశాఖ లీగల్ : బీచ్ రోడ్‌లోని గాయత్రీ విద్యా పరిషత్ ఉన్నత పాఠశాలలో గాయత్రీ వైద్య కళాశాల, ఆసుపత్రి ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ఆచార్య పి సోమరాజు ఆధ్వర్యంలో డాక్టర్ పద్మినిదేవి బాలికల సంరక్షణ, భద్రత ఆవశ్యకతను వివరించారు.కార్యక్రమంలో డాక్టర్ శివాని, బి ప్రవల్లిక, బి లేఖ, బి సాయి, ఎం సుచిత్ర, జి దివ్య, బి కిరణ్ పాల్గొన్నారు.వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.


సైడ్ కాలువ నిర్మాణం చేస్తున్న దృశ్యం

జెడ్‌పిటిసి నిధులతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-కోటవురట్ల

జెడ్‌పిటిసి నిధులతో మండలంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మండలంలోని పీకే పల్లి, ఆకసాహెబ్‌పేట, కైలాసపట్నం గ్రామాలలో మూడు లక్షల రూపాయలతో బోర్లు ఏర్పాటు చేశారు. రామచంద్రపాలెం, కైలాస పట్నం, పీకేపల్లి, గ్రామాలలో 11 లక్షల 50 వేల రూపాయలతో కాలువ పనులు చేస్తున్నట్లు గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు.

ధన ధాన్య కృషి యోజనతో వ్యవసాయ రంగం అభివృద్ధి

ప్రజాశక్తి-సబ్బవరం

ధన ధాన్య కృషి యోజన పథకం వ్యవసాయ రంగ అభివృద్ధికి దోహదపడుతుందని మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ధన ధాన్య కృషి యోజన పథకం ప్రారంభ కార్యక్రమం వర్చువల్ విధానంలో శనివారం మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల పరిషత్ అధికారులు సిబ్బంది వీక్షించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, పంట లభ్యతను మెరుగుపరచడం, పంట వివిధీకరణ ప్రోత్సహించడం, పంట కోత తర్వాత నిల్వ, సౌకర్యాలు పంచాయితీ / బ్లాక్ స్థాయిలో అభివృద్ధి చేయడం, సాగు పరిరక్షణ, నీరు వినియోగ సామర్థ్యాన్ని పెంచడం, కుర్రి రుణ సౌలభ్యం, అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.

రోడ్డు అధ్వానంతో నిలిచిన ఆర్టీసీ బస్సులు

ప్రజాశక్తి -దేవరాపల్లి : మండలంలోని కాశీపురం నుంచి చోడవరం వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఈ మార్గంలో ఆర్టీసీ బస్సు రాకపోకలను ఆర్టీసీ అధికారులు నిలుపుదల చేశారు. దీంతో ఈ ప్రాంత ప్రయాణకులు, ముఖ్యంగా పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కాశీపురం నుంచి చోడవరం వెళ్లే రోడ్డు విస్తరణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అదే సందర్భంలో ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో సుమారు పది రోజుల నుంచి ఆర్టీసీ బస్సును నిలిపివేయడంతో పల్లె ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చిననందిపల్లి సర్పంచ్ పోతల చెల్లయ్యమ్మ భర్త రఘు వెంకట ప్రసాద్ గ్రామస్తుల సహకారంతో రోడ్డు గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టారు. ఈ విషయంపై ఆర్టీసీ అధికారులకు ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మితో ఫోన్ చేయించి, ఆర్టీసీ బస్సులు యథావిధిగా నడపాలని కోరారు. ఆర్టీసీ అధికారులు సానుకూలంగా స్పందించి, ఒక్కసారి రోడ్డు వెరిఫికేషన్ చేసిన తరువాత బస్సుల రాకపోకలను కొనసాగిస్తామని తెలిపారు. దీంతో పల్లె వాసులంతా ఆర్టీసీ బస్సుల రాక కోసం ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం, నాయకులు రోడ్డు విస్తరణ పనులు నిలిపివేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


రోడ్డుపై గుంతలను పూడ్చుతున్న దృశ్యం

ప్రజాశక్తి
ఆదివారం 12 అక్టోబర్ 2025

బిసి బాలికల వసతి గృహంలో

విద్యార్థినులకు రక్షణ కల్పించాలి



మాట్లాడుతున్న గోవిందరావు

ప్రజాశక్తి- రావికమతం:రావికమతం మండల కేంద్రంలో బీ.సీ బాలికల వసతి గృహంలో 12 మంది బాలికలపై పిచ్చి కుక్క దాడి సంఘటనపై జాయింట్ కలెక్టర్ సమగ్ర మైన విచారణ చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ, ఈనెల 9 తెల్లవారు జామున బిసి బాలికల వసతి గృహంలో పిచ్చికుక్క చొరబడి12 మంది పిల్లల పై దాడి చేసిన విషయం తెలిసిందే రన్నారు. బాలికల వసతి గృహంలో నూతన మరుగుదొడ్ల నిర్మాణం జరుగుతున్న కారణంగా లోపలకి ట్రాక్టర్లు మెటీరియల్ నిమిత్తం వెళ్లడానికి ప్రహరీ గోడను కొంతమేర కట్ చేసి గ్రీన్ మ్యాట్ వేశారన్నారు. దీంతో బాలికలకు రక్షణ సక్రమంగా లేనందున పిచ్చి కుక్కలు పిల్లల పై దాడి చేయడం జరిగిందన్నారు.తొలగించిన ప్రహరీని తొందరగా నిర్మాణం చేపట్టి బాలికలకు రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి యస్.వలసయ్య, పాంగి చంద్రయ్య పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: స్థానిక వైఎస్ఆర్ క్యాంప్ కార్యాలయంలో వైయస్సార్ కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రంలో నిర్మాణాలు చేపడుతున్న 10 మెడికల్ కాలేజీలను పిపిపి పద్ధతిలో నిర్మించేందుకు సిద్ధమైన కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ కోటి సంతకాల ఉద్యమం కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు.నవంబర్ 22 వరకు రచ్చబండ కార్యక్రమంలో భాగంగా కోటి సంతకాల సేకరణ చేసి పార్టీ కేంద్ర కార్యాలయం ద్వారా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగానే ర్యాలీలు, నిరసనలు చేయనున్నామన్నారు.

శ్రమదానంతో తుప్పల తొలగింపు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని విప్పలపాలెం ఆయకట్టు ప్రధాన కాలువతో పాటు గట్టుపై తుప్పలు పెరిగి పోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో శనివారం ఆయకట్టు కాలువ ఛైర్మన్ గొల్లి సత్తిబాబు ఆధ్వర్యంలో ఆయకట్టు రైతులు శ్రమదానంతో కాలువ, గట్టుపై ఉన్న తుప్పలను తొలగించారు.



తొలగిస్తున్న రైతులు

గృహ నిర్మాణాలకు భూమి పూజ

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలో బోధిగల్లం వద్ద కేటాయించిన ఆర్ఆర్ కాలనీలో శనివారం డిఎల్ పురం గ్రామానికి చెందిన 6 కుటుంబాల నిర్వాసితులు గృహ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా నివాస గృహాలు కోల్పోయిన కుటుంబా లకు బోధిగల్లం వద్ద పునరావాసం కల్పించారు. ఈ మేరకు డిఎల్ పురం గ్రామానికి చెందిన నిర్వాసితులు గింజల నూకాలమ్మ, చిన్న అప్పారావు, చేపల బంగారు తల్లి, బొంది రామయ్యమ్మ, పీతల సత్యవతి, యజ్జల రత్నం గృహ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వీవి రమణ, తహసిల్దారు నరసింహమూర్తి, పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, మార్కెట్ యార్డ్ కమిటీ ఛైర్మన్ దేవర సత్యనారాయణ, సర్పంచ్ ఫాతిమా ముస్సీషా, నాయకులు నూకరాజు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న నాయకులు, అధికారులు



నిరసన చేపడుతున్న దళిత రైతులు

రాళ్ల క్వారీని రద్దు చేయాలి

- దళిత రైతుల నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మాకవరపాలెం మండలం జి.కోడూరులో క్వారిని రద్దు చేయాలని దళిత రైతులు సుమారు రెండు నెలల పాటు నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం ముందు వినూత్న రీతిలో పలు రకాలుగా నిరసన చేసినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు గాని స్పందించలేదు. శాంతియుతంగా నిరసన చేస్తుంటే అధికారులు టెంట్‌ను పీకేశారు. దీంతో దళితులు విజయవాడలో ఉన్న భారతీయ గనులశాఖ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఎబిఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు, బీఎస్పీ పార్టీ నేత బొట్టా నాగరాజు మీడియాకు తెలియజేస్తూ రాళ్ల కారణంగా సాగు చేసిన పంటలు కూడా పాడైపోయే పరిస్థితి ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి దళితుల పొట్ట కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాళ్ళ క్వారీని రద్దు చేసి, దళిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొల్లు గంగాధర్, అప్పలనాయుడు, అప్పారావు, లోవరాజు, పెంటయ్య, నాగభూషణం, చిరంజీవి పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:జిల్లాలోని ప్రజలకు న్యాయపరమైన సలహాలతో పాటు తగు న్యాయం సహాయం చేయాలని ఆలోచన ఉండి స్వచ్ఛందంగా పనిచేసే పారా లీగల్ వాలంటీర్లు (న్యాయ సహాయ కులు)గా పనిచేయడానికి ఆసక్తి కలిగి ఉన్న యువతి యువకులు ఈనెల 14 లోపు మండల న్యాయ సేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి కనీస విద్యార్హతగా అని, వివిధ సేవా సంస్థలలో పని చేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికయిన అభ్యర్థులకు ఎటువంటి జీతం, పారితోషం ఉండదని ఆయన స్పష్టం చేశారు.



రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

రోడ్డు మరమ్మతులు చేపట్టండి

- జనసేన సీనియర్ నేత దొరబాబు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:నర్సీపట్నం మున్సి పాలిటీ బలిఘట్టం వై.జంక్షన్ నుంచి జోగినాధుని పాలెం వెళ్లే రోడ్డు మరమ్మతు చేపట్టాలని జనసేన పార్టీ సీనియర్ నాయకులు అప్పన దొరబాబు కోరారు. దొరబాబు పార్టీ నాయకులతో కలిసి ఈ గొయ్యిను పరిశీలించారు. జనసేన నాయకులు ఫిర్యాదు మేరకు ఆర్అండ్‌బీ ఏఇ నాయుడు అక్కడికి చేరుకున్నారు. ఈ రోడ్డుకు నిధులు కేటాయించారని, త్వరలోనే పనులు చేపడతామని ఏఇ జనసేన నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని నాయకులు ఏఇని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అద్దేపల్లి గణేష్, మారిశెట్టి రాజా తదితరులు ఉన్నారు.

యుటిఎఫ్ నేతల వినతి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: తరల్ శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు సిసిఎల్ మంజూరు చేయాలని యూటీఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారి సుందర్రావుకు వినతి పత్రాన్ని శనివారం అందజేశారు జిల్లా కార్యదర్శి కమిటీ సభ్యుడు, మండల అధ్యక్షుడు కన్నయ్య, రఘునాథ్, బాలక్రిష్ణ మాట్లాడుతూ, రెండో శనివారం సెలవు కావడంతో సీసీఎల్ మంజూరు చేయాలని వినతి పత్రంలో పేర్కొవడం జరిగిందన్నారు. స్పందించిన ఎంఈవో శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేస్తున్నామని ప్రకటించడంతో ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఆ సంఘం నాయకులు రాజారావు, దుక్కు, సుబ్బారావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉరలోవ కొండ భూ సమస్యపై

కూటమి నేతలు అవగాహనతో మాట్లాడాలి

ప్రజాశక్తి- మాడుగుల:వి.మాడుగుల ఉరలోవకొండ భూ సమస్యపై కూటమి నాయకులకు పూర్తిగా అవగాహన లేకుండా జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ద్వారా జిల్లా కలెక్టర్‌కు చెప్పించి అడ్డుకుంటున్నారని, దీనికి తగిన మూల్యం చెల్లించక తప్పదని సిపిఎం నేతలు స్పష్టం చేసారు. శనివారం విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి వ్యవసా య కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.భవాని తదితరులు మాట్లాడారు. వమ్మలి, జగన్నాధపురం క్రిష్టాపురం, రావికమతం మండలం కొమిరి గ్రామాల్లో 6 వ విడత భూ పంపిణీలో ఉరలోవ కొండకు చుట్టు 450 మందికి పట్టాలు ఇచ్చిన భూములకు సర్వే నెంబర్లు సరి చేయడం కోసం గ్రామ సభలు జరిపి వెంటనే వెబ్ లెండ్ లో నమోదు చేయాలని, గత నెల 27 వ తేదిన జిల్లా కలెక్టర్ స్పష్ట మైన ఆదేశాలు ఇచ్చారన్నారు. దీని పై మరల ఉరలోవ కొండ భూ సమస్యపై కూటమి ప్రభుత్వం పేదలకు న్యాయం చేస్తామని చెప్పడంలో అర్థం లేదన్నారు 2016 - 2017లో 6 వ విడత భూ పంపిణీలో ఉరవ కొండ చుట్టు వందలాది మంది పేదలకు, గిరిజనులకు, ధళితులకు నాటి ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసిందని తెలిపారు. సాగులో ఉన్న సర్వే నెంబర్లు గల భూములకు సంబంధం లేదని తెలిపారు.2016 వ సంవత్సరం నుండి అధికారులకు రెవెన్యూ సదస్సుల లోను అనేక సార్లు ధరఖాస్తులు పెట్టుకు న్నారని తెలిపారు, గతంలో సిపిఎం నాయకులు, పేదలు విజయవాడలో సి సి ఎల్ ఎ కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. దీంతో కలెక్టర్ స్పందించి వెబ్ లెండ్‌లో సరి చేయాలని ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. అయి నప్పటికీ కూటమి నాయకులు రాజకీయ ఒత్తిళ్ళకు తలొగ్గి ఆర్ డి ఓ, తహశీల్దార్ కలెక్టర్ ఆదేశాలను చెత్త బుట్టలో వేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది చాలదన్నట్లు కూటమి నాయకులు ఎమ్మెల్యే కలెక్టర్ తో మాట్లాడారని ఉరవ కొండ బాధితులకు న్యాయం చేస్తామని గ్రామాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు.సిపిఎల్‌పి, జిల్లా కలెక్టర్ పేదలకు న్యాయం చేయడం కోసం ఇచ్చిన ఆదేశాలను కూటమి నాయకులు అడ్డు కోవడం మంచి పద్ధతి కాదన్నారు.భూ సమస్యను పరిష్కారం చేసి పేదలకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేసారు.

రామచంద్ర యాదవ్ పర్యటనకు అనుమతి లేదు

- ఎస్ఐ సన్నిబాబు

ప్రజాశక్తి -నక్కపల్లి:బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ రాజయ్యపేట వచ్చేందుకు అనుమతి లేదని ఎస్ఐ సన్నిబాబు స్పష్టం చేశారు. బల్క్ డ్రగ్‌ను ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలకు సంఘీభావం తెలిపేందుకు కోర్టు అనుమతి ఇవ్వడంతో రామచంద్ర యాదవ్ ఆదివారం రాజయ్యపేట వస్తున్నట్టు ఆయన వర్గీయులు తెలియజేయడంతో, ఎస్ఐ సన్ని బాబు మత్స్యకారుల ఆందోళన శిబిరం వద్దకు వచ్చి జిల్లా ఎస్పీ పంపించిన ఉత్తరుల నోట్ ను మత్స్యకార నాయకులకు అందజేసారు. రామచంద్ర యాదవ్ గ్రామానికి వస్తే సమస్య తలెత్తే అవకాశం ఉన్నందున, ఆయన అభ్యర్థనను తిరస్కరించడం జరిగిందన్నారు. ఈనెల 5న రామచంద్రయాదవ్‌ను రాజమండ్రిలో పోలీసులు అడ్డుకున్న విషయం తెలిసిందే.



తొలగిస్తున్న సిబ్బంది

చెట్ల కొమ్మల తొలగింపు

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ- నర్సీపట్నం ప్రధాన రోడ్డులోని అరిలోవ అటవీ ప్రాంతంలో గత కొంత కాలంగా చెట్ల కొమ్మలు, వెదురు పొంతలు పెరిగి పోయాయి. దీంతో, ఈ కొమ్మలు విద్యుత్ వైర్లకు తగిలి పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం విద్యుత్ శాఖ అధికారుల పర్యవేక్షణలో విద్యుత్ వైర్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మలను, వెదురు పొంతలను తొలగించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో విద్యుత్ సౌకర్యంకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఈ చర్యలు చేపట్టామని విద్యుత్ అధికారులు తెలిపారు.

సిఐటియు అఖిల భారత మహాసభ లోగో, పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:విశాఖ నగరంలో ఈ ఏడాది డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4 వరకూ జరగనున్న సిఐటియు అఖిల భారత మహాసభల లోగోను, పోస్టర్‌ను శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 70 లక్షల మంది కార్మికుల సభ్యత్వానికి ప్రాతినిథ్యం వహిస్తూ 1500 మంది ప్రతినిధులు 29 రాష్ట్రాల నుండి ఈ మహాసభలకు హాజరవుతున్నారన్నారు ఈ మహాసభల్లో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్నటువంటి కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చలు జరిపి భవిష్యత్తు పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్నటువంటి 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను మార్పు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చిందన్నారు. ఫలితంగా కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసుకునే హక్కు, జీతభత్యాలు బేరం ఆడుకునే హక్కు వంటి ప్రాథమికమైనవి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. మన రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం 8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ చట్టం చేసిందన్నారు. దీనిని కార్మిక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందన్నారు. ఈ కార్మిక, ప్రజా వ్యతిరేక చర్యలన్నింటిపైనా ఉద్యమిస్తామన్నారు. సిఐటియు ఏర్పడ్డ 55 సంవత్సరాల కాలంలో మొదటిసారి అఖిలభారత మహాసభలు విశాఖ నగరంలో జరుగుతున్నాయని, దీనికి ఆతిథ్యం ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. మహాసభల చివర రోజైన జనవరి 4న లక్ష మందితో భారీ కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. మహాసభల సందర్భంగా రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు, సాంస్కృతిక కార్యక్రమాలు, కళారూపాలు, ఎగ్జిబిషన్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మహాసభల జయప్రదానికి విశాఖ నగరంలో ఉన్నటువంటి కార్మికులు, ప్రజలు, శ్రేయోభిలాషులు, మేధావులు, అభ్యుదయవాదులు ఆర్థిక, హార్థిక సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు, జిల్లా కార్యదర్శులు పి.మణి, బి.జగన్, ఉపాధ్యక్షులు కెఎం.కుమార్ మంగళం, ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి పాల్గొన్నారు.



సిఐటియు అఖిల భారత మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు


ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

స్టీల్ ప్లాంట్ టౌన్ షిప్ కోసం

అదనంగా భూములివ్వం

- స్పష్టం చేసిన రైతులు - ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి -నక్కపల్లి:స్టీల్ ప్లాంట్ టౌన్ షిప్ కోసం అదనంగా భూములు ఇచ్చేది లేదని రైతులు స్పష్టం చేశారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ఆర్డిఓ వి.రమణ స్టీల్ ప్లాంట్ టౌన్షిప్ కోసం అదనంగా భూసేకరణ చేపట్టేందుకు మండలంలో నెల్లిపూడి రెవెన్యూ పరిధిలో వేంపాడు, అమలాపురం గ్రామానికి చెందిన రైతులతో శనివారం సమావేశం నిర్వహించారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణతో కలిసి రైతులందరూ భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేస్తూ ఆర్డిఓ రమణకు వినతిపత్రం అందజేశారు. స్టీల్ ప్లాంట్ టౌన్షిప్ కోసం అదనంగా భూసేకరణ చేపడుతున్నారని, భూములు ఇచ్చేందుకు తాము సిద్ధంగా లేమన్నారు. ఆ భూముల్లో కొబ్బరి తోటల కొనసాయంతో జీవనం సాగిస్తున్నామని, ఆ భూములు ఇస్తే రోడ్డును పడతామని రైతులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు రామచంద్ర రాజు, వెంకటపతి రాజు పాల్గొన్నారు.

28వ రోజుకు మత్స్యకారుల దీక్షలు

ప్రజాశక్తి -నక్కపల్లి:పోలీసుల ఆంక్షలు, నిర్బంధాలకు, కేసులకు భయపడే ప్రసక్తే లేదని, బల్క్ డ్రగ్ పార్క్ నిలుపుదల చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని, అణిచివేయాలని చూస్తే సునామీలా విరుచుకుపడతామని మత్స్యకార నాయకులు స్పష్టం చేశారు. మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు శనివారం నాటికి 28వ రోజుకు చేరింది. మత్స్యకార గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు మత్స్యకారుల ఉద్యమానికి సంఘీభావం తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. బంగారమ్మపాలెం సర్పంచ్ మైలపల్లి శ్రీను, రేవుపోలవరం సర్పంచ్ చోడిపల్లి గోవిందు, కొత్త రేవుపోలవరం సర్పంచ్ మల్లె లోవరాజు, వాడపాలెం సర్పంచ్ శివాజీ, మత్స్యకార సంఘ నాయకులు మాతా గురునాధరావు, ఎస్.రాయవరం మండలం వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న తదితర నాయకులు మాట్లాడారు. బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు 28 రోజుల నుండి ఆందోళన చేస్తుంటే ప్రభుత్వానికి కనిపించ లేదా అని ప్రశ్నించారు. తీర ప్రాంతాల్లో ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయడంతో మత్స్యకారుల జీవితాలు ఇప్పటికే నాశనం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే మత్స్యకారుల ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందన్నారు. పర్యావరణానికి, రైతులకు, మత్స్యకారులకు నష్టం కలిగించే బల్క్ డ్రగ్ ను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ మాట్లాడుతూ, పార్టీ క్యాడర్‌తో కలిసి చలో రాజయ్యపేట కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, మత్స్యకార నాయకులు ఎరిపిల్లి నాగేష్, రాంబాబు, మైలపల్లి బైరాగిరాజు, వైసిపి నాయకులు తళ్ల భార్గవ్, గోవింద్, మత్స్యకారులు, మహిళలు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న మత్స్యకారులు, నాయకులు


పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్

ఈ - పంట నమోదుతో లాభాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: ఈనెల 25 నాటికి రైతుల ందరూ ఈ -పంటను నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ సూచించారు. మండలంలో కాగిత గ్రామంలో శనివారం సిబ్బందితో కలిసి రైతులకు ఈ -పంటను నమోదు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ మాట్లాడుతూ, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, ఇన్పుట్ సబ్సిడీ, కాలానుగుణ పంట నష్ట పరిహారం వంటి ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలంటే ఈ పంట నమోదు తప్పనిసరి అని అన్నారు. మండలంలో వ్యవసాయ, ఉద్యాన పంటలు 21378 ఎకరాలకు గాను 15965 ఎకరాలు (73 శాతం) నమోదు చేయడం జరిగిందన్నారు.ఆయా గ్రామాల్లో గడువు లోపు రైతులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని ఈ పంట నమోదు చేయాలని, ఈ పంటతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని ఆర్.ఎస్.కె సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమములో ఏఈఓలు శ్రీనివాస్, సాయి కుమారి, వ్యవసాయ సహాయకులు ధనరాజ్, ఆర్ ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు మెరుగుపరచాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గిరిజన విద్యార్థుల్లో విద్యా సామార్థ్యాలు మెరుగుపడేలా బోధన సాగించాలని మండల విద్యాశాఖ అధికారి ఎస్ సుందర్రావు కోరారు. మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో తరల్ శిక్షణ ముగింపు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యాభివృద్ధికి ప్రతిఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. సమయపాలన పాటించి బాలల్లో నూతనోత్తేజం కలిగించేలా విద్యా సామార్థ్యాలు పెంచాలని ఆయన సూచించారు. రెండు దశల్లో 382మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని చెప్పారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాద్యాయులు పాల్గొన్నారు.

సిటీ లెవల్ పార్క్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-అనకాపల్లి : విఎంఆర్‌డిఎ ఆధ్వర్యంలో అనకాపల్లి మండలం కొత్తూరు కూడలి సమీపంలో సిటీ లెవల్ పార్క్ నిర్మాణానికి శనివారం అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్, కమిషనర్ కెఎస్ విశ్వనాధన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొత్తం 5.68 ఎకరాల విస్తీర్ణంలో అనకాపల్లి, సమీప గ్రామాల ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, ఆధునిక వసతులు, పచ్చదనం పెంపు, అందమైన ప్రకృతి వాతావరణంలో పార్క్ నిర్మాణానికి రూపకల్పన చేయడం జరుగుతుందని తెలిపారు. పాజెక్ట్ నిర్మాణానికి 4.5 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందన్నారు. సైట్ లెవెలింగ్, కాంపౌండ్ వాల్, ప్రవేశ ద్వారం, టికెట్ కౌంటర్, వాచ్‌మన్ గది నిర్మాణం కొరకు రూ.1.45 కోట్లు, శౌచాలయాలు, అంతర్గత నడక మార్గాలు, నీటి సరఫరా పంపిణీ బోర్లు కోసం రూ.1.60 కోట్లు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు. రూ.45 లక్షలతో యువతకు వ్యాయామం పరికరాలు, పిల్లల కోసం ఆట పరికరాలు, ఓపెన్ జిమ్ పరికరాలు, కోటి రూపాయల ఖర్చుతో ఆధునిక లైటింగ్, సురక్షితమైన విద్యుత్ వ్యవస్థ, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె రమేశ్, సిఈ వినయ్ కుమార్, ఎస్ఈ భవానీ శంకర్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ సత్యనారాయణ పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎంపీ రమేష్, ఎమ్మెల్యే కొణతాల తదితరులు

డైట్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్


ఆచార్య మురళీకృష్ణను సత్కరిస్తున్న రత్నాకర్ తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ అటానమస్ కళాశాలలో "ఇన్నోవేటివ్ పెడగోజిఎస్, రీసెర్చ్ ఎక్స్లెన్స్ అండ్ ప్రొఫెషనల్ స్కిల్స్ ఇన్ ఇంజనీరింగ్" అంశంపై ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ శనివారం నిర్వహించారు. జేఎన్టీయూకే మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కెవిఎస్‌జి.మురళికృష్ణ ప్రధాన వక్తగా విచ్చేసి ఇంజనీరింగ్ విద్యలో బోధనా విధానాలలో కొత్త దృక్పథం, పరిశోధనలో నాణ్యత, అధ్యాపకుల ప్రొఫెషనల్ నైపుణ్యాల అభివృద్ధి గురించి విశదంగా తెలియజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, చైర్మన్ రత్నాకర్ మాట్లాడుతూ అధ్యాపకుల నిరంతర అభ్యాసం ద్వారానే విద్యా ప్రమాణాలు పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమాన్ని డీన్ అకాడెమిక్స్ డాక్టర్ వివి.ఫణిబాబు సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

గోకులం షెడ్లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వాలాబు పంచాయతీ పరిధిలోని పాడి రైతులకు గోకులం పథకం కింద షెడ్లు మంజూరు చేయాలని ఆ పంచాయతీ సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో 27 పంచాయితీలకు గాను నాడు వైసిపి పాలనలో వాలాబు పంచాయతీ అభివృద్ధికి నోచుకోలేదని, నేడు కూటమి ప్రభుత్వంలోనూ తమ పంచాయతీ పట్ల చిన్నచూపు సరికాదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం గోకులం షెడ్లు మంజూరు చేస్తుందని తెలిసి గిరిజనులు దరఖాస్తులు చేసి పంచాయతీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఒక్క గోకులం షెడ్డు కూడా మా గిరిజన పంచాయితీకి మంజూరు చేయకపోవడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. మండలంలో 78 గోకులం షెడ్లు మంజూరు చేసినట్లు అధికారుల గణాంకాల్లో చెబుతున్నా తమ గిరిజన పంచాయితీకి ఒక్క షెడ్డు కూడా ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. నాటి వైసిపి పాలనలోనూ, నేటి కూటమి ప్రభుత్వ పాలనలోనూ తమ పంచాయతీ గిరిజనుల పరిస్థితి అగమ్యగోచరంగానే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి గోకులం షెడ్లు మంజూరు చేయాలని సర్పంచ్ కోరారు.